క్లుప్తంగా

ఎమ్మెల్సీపై దాడి అమానుషం


పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెండ్ర వీరన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కడపజిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి సంస్కృతి మంచిదికాదని మండిపడ్డారు. ఉపఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్సీపై ఇలాంటి భౌతిక దాడులకు దిగడం కూటమి నాయకులు, గూండాలకు ఎంత మాత్రం సమంజసం కాదని వివరించారు. ఎమ్మెల్సీపై దాడి వంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర అధికార యంత్రాంగం పలు చర్యలు తీసుకోవాలని పెండ్ర వీరన్న కోరారు.

ఆచంట సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ


ఆచంట సీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న సమన్వయాధికారి సూర్యనారాయణ

పెనుగొండ: ఆచంటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆసుపత్రుల జిల్లా సమన్వయాధికారి డాక్టర్ పి.సూర్యనారాయణ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి రోగులకు సత్వరం సేవలందించాలన్నారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా వారి నుంచి మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివ రంజనీ, సూపరింటెండెంట్, వైద్యులు పాల్గొన్నారు.

మద్యం సేవించిన నలుగురికి జరిమానా

భీమవరం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున భీమవరం స్పెషల్ జ్యుడిషియల్ 2వ తరగతి మెజిస్ట్రేట్ ఎంపీఎస్ రాజారావు జరిమానా విధించినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. మంగళవారం రాత్రి వన్‌టౌన్ పరిధిలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఇద్దరు ఆటో డ్రైవర్లు, 12 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నలుగురికి జరిమానా విధించారని సీఐ చెప్పారు.

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ఉండి: అధిక కట్నం తేవాలంటూ మహిళ వేధింపులకు గురికావడంతో పోలీసులను ఆశ్రయించింది. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉండి పెదపేటకు చెందిన గుండుగొల్లు దివ్య, గుండుగొల్లు సాల్మన్‌రాజు భార్యాభర్తలు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. అయితే వివాహానంతరం మద్యానికి, చెడు అలవాట్లకు బానిసైన సాల్మన్‌రాజు శారీరకంగా, మానసికంగా తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు అతనికి అత్తమామలు, ఆడపడుచు సహకరిస్తున్నారని దివ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎండీ నసీరుల్లా వివరించారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని నిరసన


పైప్‌లైన్ వాల్ మూసివేయవద్దని నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలోని పలు వీధులకు ఉదయం 8 గంటల ప్రాంతంలో కుళాయి నీటి సరఫరాను నిలుపుదల చేయడంపై ఆ ప్రాంత వార్డు కౌన్సిలర్లు గేదల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి, సీపీఎం నాయకులు, మహిళలు పైప్‌లైన్ వాల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్థానిక దుంపగడప గేటు వద్ద ఉన్న పైప్‌లైన్ వాల్ వద్ద బుధవారం నిరసన తెలుపుతూ కమిషనర్ సంఘటనా స్థలానికి రావాలని నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు బీవీ వర్మ, దోకల రవితేజ, కె.తవిటినాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కుళాయి నీరు ఉదయం 6 గంటలకు ఆ తరువాత 8 గంటలకు వదులుతుండేవారని, గత రెండు నెలలుగా నీటిని విడుదల చేయకుండా వేరే ప్రాంతానికి సరఫరా చేయడంతో నీటి ఎద్దడి తీవ్రమైందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై కమిషనర్‌కు పలు సార్లు వినతి పత్రం అందజేసినప్పటికీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నిలుపుదల చేశామని చెబుతున్నారన్నారు. వాల్ వద్ద నిరసన వ్యక్తంచేయడంతో 8 గంటల ప్రాంతంలో ఓహెచ్ఎస్ఆర్ నుండి నీటి సరఫరానే బంద్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల గొంతు ఎండే విధంగా చర్యలు తీసుకోవడం తగదని కౌన్సిలర్లు అప్పారావు, శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు.

గ్రామాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం

- కనిపించని డంపింగ్ యార్డులు
- వేధిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది కొరత
- కంపు కొడుతున్న తీరగ్రామాలు


నరసాపురం మండలం రుస్తుంబాధ పంచాయతీలో రోడ్డు పక్కన చెత్తను పోస్తున్న దృశ్యం

నరసాపురం: నియోజకవర్గంలో గ్రామాలు కంపుకొడుతున్నాయి. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. గ్రామాల్లో ఎక్కడా డంపింగ్ యార్డులు అనేవే లేవు. దీంతో చెత్తనంతా గ్రామాల్లోని ప్రజలు రోడ్డుమీదనే వేస్తున్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంచాయితీల్లో పారిశుద్ధ్య సిబ్బంది కూడా నామమాత్రంగానే ఉన్నారు. ఓ వైపు స్వచ్ఛభారత్ అంటూ ఊకదంపుడు ప్రచారమే తప్పిస్తే, వాస్తవంలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. డంపింగ్‌యార్డుల ఏర్పాటుకు గానీ, గ్రామాల్లో చెత్త సమస్యను పరిష్కరించడానికి గానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

రోడ్డు పక్కలనే చెత్తకుప్పలు..

నియోజకవర్గానికి సంబంధించి నరసాపురం మండలంలో 28 గ్రామాలు, మొగల్తూరు మండలంలో 17 గ్రామాలు ఉన్నాయి. నరసాపురం మండలంలో కొప్పర్రు, ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్ళు గ్రామాల్లో రికార్డుల ప్రకారం డంపింగ్ యార్డులు ఉన్నట్టుగా చూపిస్తున్నారు. ఈ గ్రామాల్లో చెత్తను వేసుకోవడానికి కొద్దిపాటి స్థలాలు ఉండడం ఇందుకు కారణం. మిగిలిన గ్రామాల్లో ఆ పరిస్థితి కూడా లేదు. వేములదీవి, చినమైనవానిలంక, రుస్తుంబాధ, పెదమైనవానిలంక లాంటి తీరప్రాంత గ్రామాల్లో ఇళ్లలోని చెత్తను రోడ్డు మీదనే పోస్తున్నారు. మొగల్తూరులో అసలు ఏ గ్రామంలో కూడా డంపింగ్ యార్డ్‌లేదు. నరసాపురం మండలం మొత్తంగా 30 మంది, మొగల్తూరు మండల కేంద్రంలో కేవలం 5గురు మాత్రమే పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కేంద్ర సాయాన్ని విస్మరిస్తున్న వైనం

గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ నిధుల నుంచి భారీగా ప్రోత్సాహకాలు అందిస్తుంది. ట్రాక్టర్ కొనుగోలుకు రూ.20 లక్షలు, తడిచెత్త, పొడిచెత్త సేకరణకు సామాగ్రి అందిస్తుంది. కానీ స్థానిక ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి లేకపోవడం, అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా తీరగ్రామాల్లో ప్రస్తుత వర్షాకాలంలోనూ, తుఫాన్‌ల సమయంలోనూ పారిశుద్ధ్యం అత్యంత దారుణంగా తయారవుతుంది.

డీఎన్నార్ కళాశాలలో తెలుగు పోటీ పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యం దిశగా ప్రయత్నిస్తే విజయం సాధిస్తారని దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు–తెలుగు అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను క్రమపద్ధతిలో చదువుకోవడం వల్ల ఇంటర్ పాసై వెంటనే టీసీగా పనిచేశానన్నారు. అనంతరం డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి కాంపిటేటివ్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించి అధ్యాపకుడిగా స్థిరపడ్డానని వివరించారు. క్రమశిక్షణ, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, రవిశంకర్, నోబుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల నియామకం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండల వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం నియమించారు. పాలకొల్లు మండలం యూత్ వింగ్ అధ్యక్షుడిగా వర్ధినీడి విజయ్ శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాలి వర్ధిని, రైతు విభాగం అధ్యక్షుడిగా కామిశెట్టి వెంకట నారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా నున్నబోయిన వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుడిసె వర్మ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మీనశెట్టి నరేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా తండా ఇస్సాక్ రాజు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా కొయ్యే హరిబాబు, పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పెన్మెత్స వెంకట రామకృష్ణం రాజు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా కుక్కల యుగంధర్, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా గుంపుల అనిల్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా చల్లా సాంబయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కెల్లా సింహాచలం, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా అన్నవరపు వెంకటరమణ, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా బందెల పృద్విరాజ్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా మడికి విక్రమ్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నడపన ఆదినారాయణ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా భావన సునీల్, లీగల్ సెల్ అధ్యక్షుడిగా బొడ్డుపల్లి శ్రీనివాసరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా కవురు సురేష్ కుమార్, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా విప్పర్తి జయరాజు, ఇన్‌స్టలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా చల్లా విశ్వనాథం, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా వేండ్ర ప్రసాద్‌లను నియమించారు.

పోడూరు మండలంలో ఇలా

యూత్ వింగ్ అధ్యక్షుడిగా దిగమర్తి నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వడ్లపాటి కాంతమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా ముచ్చర్ల రాము, బిసి సెల్ అధ్యక్షుడిగా దొమ్మేటి హరికృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కుసుమే సుభాకర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నెల్లి ప్రసాద బాబు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా నాగరాజు రమేష్ రాజు, పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా కొల్లి వెంకట్రావు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా దొమ్మేటి సాయి, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా విప్పర్తి విల్సన్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా అందే నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మల్లుల నాగరాజు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా మారంపూడి చిన్నయ్య, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా పాతగొలుసుల శంకర్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కేతా వెంకటేశ్వరరావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా తానేటి శ్రీనివాస్, పబ్లిసిటి వింగ్ అధ్యక్షుడిగా తానేటి సురేష్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా జక్కంశెట్టి అరుణకుమార్ (హనుమంతు), లీగల్ సెల్ అధ్యక్షుడిగా మామిడివరపు ఆంజనేయులు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా శేషపు సాయిరాం, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా కొమ్మోజు వెంకటసత్యనారాయణ, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా వడ్లపాటి సురేష్‌లను నియమించారు.

పార్టీ బలోపేతానికి కమిటీల ఏర్పాటు


తూర్పుతాళ్లు నూతన గ్రామ కమిటీ సభ్యులతో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. నూతన కమిటీలను మండలపార్టీ అధ్యక్షుడు ఉంగరాల రమేష్‌నాయుడు నేతృత్వంలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ మేరకు బుధవారం తూర్పుతాళ్లు గ్రామంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తూర్పుతాళ్ల గ్రామశాఖ అధ్యక్షుడిగా పులపర్తి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా దొంగ నాగేశ్వరరావు, కోరం కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులుగా పులపర్తి రఘు, బొక్కా శంకరరావు, కారిపల్లి కృష్ణ, కార్యదర్శులుగా మామిడిశెట్టి కోటేశ్వరరావు, తెన్నేటి రమేష్, పులపర్తి పురుషోత్తం, కార్యవర్గ సభ్యులుగా కడలి సూర్యనారాయణ, కొండేటి శ్రీను, బండారు రాజబాబు, కొల్లాబత్తుల మోహనరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరినీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అభినందించి మాట్లాడుతూ అంకిత బావంతో పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు.

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు

నరసాపురం రూరల్: నూతనంగా వచ్చిన మార్పులను అన్వయించుకుని పని చేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చునని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు (డ్వామా,పీడీ) డాక్టర్ కె సిహెచ్ అప్పారావు అన్నారు. నరసాపురం పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నరసాపురం క్లస్టర్ పరిధిలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ముఖ ఆధారిత అటెండెన్సును వినియోగించాలన్నారు. అదే విధంగా జియో ఫెన్సింగ్ యాప్ వినియోగంలోకి తీసుకు వస్తున్నామని దీని ద్వారా చేసే పనులకు సంబంధించి నిర్దిష్టమైన కొలతలతో కూడిన పనులు చేపట్టే సౌలభ్యం ఉంటుందన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా తీసే ఫోటోలను అప్‌లోడ్ చేయాలని దాని ద్వారా కూలీల అటెండెన్సు కచ్చితత్వంతో కూడి తప్పులు దొర్లకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీవో) శ్రీనివాస్, కోర్స్ ఆర్డినేటర్లు ఆనంద, రవితేజ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు, బాధ్యతలు గురించి, గ్రామ పంచాయతీలో నిర్వహించాల్సిన రిజిస్టర్లు గురించి రోజువారి పనికి కల్పన ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు పంపడం, రెండు పూటలా పనులు చేయించి ఫొటోస్ అప్లోడ్ చేయడం, రోజువారి పని కొలతలు ఇవ్వడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వీరా సుదర్శన్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై వారణాసి, అయోధ్య యాత్ర


అయోధ్య సైకిల్ యాత్ర చేస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కెనాల్ రోడ్డు గాంధీబొమ్మల సెంటర్ వద్ద కొలువై ఉన్న శ్రీ దాసోహాంజనేయస్వామి ఆలయం అర్చకులు మరుదూరి నరసింహ ఆచార్యులు అతని మిత్రుడు రాజా వెంకన్నలు పాలకొల్లు నుంచి అయోధ్య, వారణాసి సైకిల్‌పై యాత్ర చేస్తున్నారు. 20 రోజులు పాటు ఈ ప్రయాణం కొనసాగుతుందన్నారు. గతంలోను శబరిమలై, శ్రీశైలం, భద్రాచలం, చిన్న తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు సైకిల్‌పైనే యాత్ర చేశానని తెలిపారు. ముందుగా వారణాసిలో దర్శనం చేసుకుని అనంతరం అయోధ్య రామయ్య సన్నిధికి చేరుకుంటామని ఆచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రారంభించిన ఈ యాత్ర ప్రస్తుతం భద్రాచలం దాటినట్లు తెలిపారు. పగలు ప్రయాణం కొనసాగిస్తూ రాత్రి సమయాల్లో ఏ గ్రామంలో ఆలయం దగ్గర్లో ఉందో చూసుకుని అక్కడ బస చేస్తున్నామన్నారు. యాత్రకు కావాల్సిన సామాగ్రిని సైకిల్‌కు ఏర్పాటుచేసుకుని బయలుదేరినట్లు తెలిపారు.

వంతెన యాతన ఇంకెన్నాళ్లు?


మార్టేరులో వంతెనకు మధ్యలో కాంక్రీట్ బీటలు వారి ఏర్పడిన గొయ్యి


మార్టేరు వంతెనపై పుట్‌పాత్ ప్లేట్లు పగిలి ప్రమాదకరంగా మారిన దృశ్యం

పెనుమంట్ర: మార్టేరు సెంటర్‌లో నరసాపురం కాలువపై బ్రిటిష్ కాలంనాటి వంతెన స్థానంలో కొత్తగా నిర్మించిన వంతెన అప్పుడే బీటలు వారి ప్రమాదకరంగా మారుతుంది. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏడేళ్ల క్రితం ఈ వంతెన పునర్నిర్మించారు. అయితే వంతెన మధ్యలో కాంక్రీట్ బీటలు వారి పూసలు బయటపడి గొయ్యిగా మారుతుంది. వంతెనకు ఇరువైపులా కట్టిన పుట్‌పాత్ ప్లేట్లు కూడా పగిలిపోతుండటంతో పుట్ పాత్ పై గోతులు ఏర్పడి కాలినడకన వెళ్లే ప్రయాణికులు ఆ గోతుల్లో పడి గాయాలు పాలవుతున్నారు. చిన్న మరమ్మతులేనని పట్టించుకోకపోతే మునుముందు ఈ వంతెన ప్రయాణం మరింత ప్రమాదంగా మారుతుందని, తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వంగా గీత నియామకంపై హర్షం


మల్లిక

యలమంచిలి: ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల మహిళ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ మంత్రి వంగా గీతా విశ్వనాథ్‌ను నియమించడంపై మండల వైఎస్సార్ సీపీ మహిళ విభాగం కన్వీనర్, కాంభొట్లపాలెం సర్పంచ్ అనిశెట్టి మల్లిక హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన వంగా గీత అనుభవం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో పార్టీ పటిష్టానికి పనికి వస్తుందని పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో పని చేయడం వ్యక్తిగతంగా తనకు ఇష్టమని వివరించారు.

వైఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం

నరసాపురం: పట్టణంలోని వైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం, ఎన్‌సీపీ లయన్స్ క్లబ్, రాయల్ క్లబ్, కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ సతీష్ ప్రారంభించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌వీ రంగారావు, డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీ రామకృష్ణ పాల్గొన్నారు.

శ్మశానవాటిక కేటాయించాలని ఆందోళన


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: మండలంలోని సీతారాంపురం సౌత్ గ్రామంలో ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలం కేటయించాలని మైదాన ప్రాంత గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలం లేకపోవడం వల్ల ఎవరైనా చనిపోతే శవాన్ని ఖననం చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలు దాటినా కాలనీవాసులకు శ్మశాన వాటిక సమస్య తీరలేదన్నారు. సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఎస్టీలు శవాన్ని పూడుస్తుంటే స్థానిక దళితపేట పెద్దలు తీవ్ర అభ్యంతరం పెడుతున్నారని వాపోయారు. ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం ఆర్డీవో దాసి రాజుకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సట్టేటి సుబ్రమణ్యం, చౌటూరి దావీదు, ఏనిగేటి చిన్న చెంచయ్య, మేకల ముత్యాలు, గంధం సూరిబాబు, సువార్త రాజు పాల్గొన్నారు.

ఎల్బీచర్ల గురుకులంలో నేడు స్పాట్ అడ్మిషన్లు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల కళాశాలల్లో 5, 10వ తరగతుల్లో జాయిన్ అయ్యే విద్యార్థులకు గురువారం నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. శ్యాంప్రసాద్ తెలిపారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు కూడా నేరుగా ప్రవేశం పొందవచ్చునన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా ఎల్బీచర్ల గురుకుల పాఠశాలకు వచ్చి ఖాళీగా ఉన్న సీట్లలో రోస్టర్ ప్రకారం ప్రవేశం పొందవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 99632 50626 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

తల్లిపాలతో బిడ్డకు ఎంతో రక్షణ


పెనుగొండ: వడలిలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం


పెనుమంట్ర: మార్టేరులో మాట్లాడుతున్న సర్పంచ్ మట్టాకుమారి

పెనుగొండ: తల్లిపాలు బిడ్డకు ఎంతో రక్షణగా ఉంటాయని, ముఖ్యంగా ముర్రి పాలు రోగ నిరోధక శక్తిని పెంపొందింపజేస్తాయని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ అన్నారు. బుధవారం వడలిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ప్రతి తల్లీ బిడ్డకు పాలు ఇవ్వడం ప్రకృతి ప్రసాదించిన వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు వీఎంఎం రూతుకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం

పెనుమంట్ర: బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టడమే శ్రేయస్కరమని మార్టేరు సర్పంచ్ మట్ట కుమారి అన్నారు. బుధవారం మార్టేరు గ్రామంలోని వరాహ నరసింహస్వామి కల్యాణ మండపంలో జరిగిన తల్లి పాల వారోత్సవ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ తల్లిపాలే శిశువుకు ఆరోగ్యానికి ప్రథమ ఔషధమని బిడ్డలు రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు ఎదుగుదలకు కూడా ఎంతగానో తోడ్పడుతుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా 32 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణకుమారి, సెక్టర్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, తమనంపూడి శ్రీనివాస రెడ్డి, తేతలి రాజారెడ్డి పాల్గొన్నారు.